బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మేకల సారంగపాణి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బడుగు బలహీనవర్గాలు, దళిత వర్గాలు బంగారు భవిష్యత్ కోసం బీజేపీకి ఓటేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కోరారు. ఆదివారం వారాసీగూడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించి కిషన్‌రెడ్డిని గెలుపునకు పాటు పడాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను నమ్మరాదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్‌కు పోటీచేసే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఎందుకు చేయలేదని, ఓడిపోతామనే భయంతో ఎమ్మెల్యే పదవులతోనే ఎంపీగా పోటీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రవిప్రసాద్ గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కేఎం కృష్ణ, నవీన్, శ్రీకాంత్, హంస రాజు, జమ్మికుంట వేణు, సత్యనారాయణ, హనుమంతు,సతీష్ రాజు పాల్గొన్నారు.

నియామకం



ఆంజనేయులు

లాలాపేట: విముక్త చిరుతల కచ్చి(వీసీకే) పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన మంచింటి ఆంజనేయులు నియమిస్తూ జాతీయ అధ్యక్షులు కతొల్ తిరుమావళవన్ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర శ్రీనివాస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని విస్తృత పరిచేందుకు ఉద్యమకార్యచరణతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం వీసీకే పోటీలో దిగుతుందన్నారు.

రాగిడికి మద్దతుగా ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపును కాంక్షిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేటలో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి ఆధ్వర్యంలో గడప గడపకూ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రాజయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఐ మద్దతు



కంటోన్మెంట్: మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఐ, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సీపీఐ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ ఎన్. బాలమల్లేశ్, కంటోన్మెంట్ ఇన్‌చార్జ్ ఎం. నర్సింహ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కంటోన్మెంట్ ప్రజానీకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి సీపీఐ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయూబ్‌ఖాన్, సంజీవ రెడ్డి ఎల్లయ్య, రాజు, మహేందర్, లింగం, కొమురయ్య, సమ్మయ్య, ఖదీర్, రషీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు ప్రచారం చేస్తాం



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరసింహ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రచారం చేయనున్నట్లు తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థి జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తరహా పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తామన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

రాంగోపాల్ పేట్ : కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన సెక్రటేరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ కు చెందిన ఓ మహిళ (33)కు వివాహమై 8 ఏళ్లు అవుతోంది. సంతానం కలగకపోవడంతో అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. రోజు రోజుకు వేధింపులు ఎక్కువవడంతో మనోవేదనకు గురవుతూ వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం సెక్రటేరియేట్ నార్త్ ఈస్ట్ గేట్ ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాశయాల్లో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. సెక్రటేరియట్ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అశోక్ ను అప్రమత్తం చేయగా, అశోక్ వెంటనే ఆ మహిళను కాపాడి సెక్రటేరియేట్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులను రప్పించి ఆ మహిళతో పాటు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

లక్కీ డ్రా విజేత నిరాలీ ధరోడ్

బంజారాహిల్స్: పంజాగుట్టలో ఇటీవల ప్రారంభించిన శుభ్ కలాష్ సిల్వర్ జ్యువెల్లరీ లక్కీ డ్రాను షోరూం నిర్వాహకులు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ మోడల్ నిహారిక హాజరై లక్కీ డ్రా తీయగా నిరాలీ ధరోడ్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతకు శుభ్ కలాష్ వ్యవస్థాపకులు కౌశిక్ చౌదరి, ధైర్య గోయెల్ అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కస్టమర్లకు ప్రత్యేకమైన ఆఫర్లను అందించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. విజేతకు రూ. లక్ష విలువైన విక్టోరియన్ లాంగ్ హారం నెక్లెస్, మ్యాచింగ్ చెవిపోగులు అందించామని తెలిపారు.

సమయం వృథా చేయొద్దు..

తీసుకుందాం క్రీడల్లో తర్ఫీదు!

- ప్రొ. జయశంకర్ స్టేడియంలో జోరుగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- ఆసక్తి కనబరుస్తున్న యువకులు, చిన్నారులు
- క్రీడాకారులతో సందడిగా మారుతున్న స్టేడియం



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

లాలాపేట: సానియా మీర్జా, పీవీ సింధూ, ముకేష్ తదితర ప్రముఖ క్రీడాకారులు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్ కోచింగ్‌లో ఒకప్పుడు శిక్షణ పొందిన వారే. ఇలా స్థానికంగా ఉండే క్రీడాకారుల నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు వేదికగా నిలుస్తున్నాయని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ అధికారులు చెబుతున్నారు. అదే స్ఫూర్తితో నేటి పిల్లందరూ ప్రతి ఏడు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా ఆసక్తి ఉన్న క్రీడలో శిక్షణ తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

వేళలు ఇవే..

షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్, యోగా, వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్ తదితర క్రీడల్లో 6 నుంచి 16 ఏళ్ల వయస్సు వారికి ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు అనుభవం ఉన్న శిక్షకులతో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



అతి తక్కువ ఫీజు కేవల రూ. 10తోనే శిక్షణ అందిస్తున్నాం. ఎవరైతే ఈ బేసిక్ శిక్షణ తీసుకుంటారో భవిష్యత్‌లో వారు క్రీడల్లో రాణించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీనివాస్‌గౌడ్ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్

మే 31 వరకు శిక్షణ..

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ కార్యక్రమాలు తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో జోరుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభమైన శిక్షణ శిబిరాలు మే 31 వరకు కొనసాగుతున్నాయి. నామా మాత్రపు ఫీజు షటిల్‌కు రూ 50తో పాటు టెన్నికాయిట్, బాక్సింగ్, జిమ్నాస్టిక్, టేబుల్ టెన్నీస్ క్రీడల్లో కేవలం రూ. 10తోనే శిక్షణ ఇస్తున్నారు. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవడంతో పాటు ఆ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రోజు దాదాపు 300 నుంచి 400 వరకు 6 సంవత్సరాల నుంచి 16 లోపు పిల్లలు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. దీంతో జయశంకర్ స్టేడియంలో క్రీడాకారులు, పిల్లలతో సందడి నెలకొంది.



క్రికెట్‌పై సూచనలు ఇస్తున్న శిక్షకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం డివిజన్ల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డిని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని తెలిపారు. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలుచేయకుండా ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన బీఆర్ఎస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నారన్నారు. ఈ సమావేశంలో కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీహరి, అశోక్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, ఏసూరి మహేష్, సురేష్‌గౌడ్, నాగులు, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్, గోపీలాల్‌చౌహాన్, రమణ, ఖలీల్, ఉత్తమ్‌కుమార్ రాజ్‌పురోహిత్ పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా



చిలకలగూడలో ప్రచారం చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు

చిలకలగూడ : సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధిక మెజార్టీతో విజయం అందించారు, ఎంపీగా అవకాశం కల్పిస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అన్నారు. ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ, వెంకటేశ్వర నగర్, బడే మసీదులేన్, లైఫ్‌స్ప్రింగ్ హాస్పిటల్, శ్రీనివాసనగర్, మహ్మద్ గూడ, షాబాద్‌గూడ, రెడ్‌క్రాస్ ఆస్పత్రి, నామాల గుండు తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ సభ్యునిగా అవకాశం కల్పిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోను అగ్రగామిగా నిలబెడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడికి వెళ్లినా స్పందన లభిస్తుందని అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో పద్మారావుకు స్థానికులు హారతులు ఇచ్చి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజుసాగర్, నాయకులు రామేశ్వరగౌడ్, కరాటే రాజు, శేఖర్, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరుతో మోసం

అమీర్‌పేట: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీకేగూడకు బి.వి శాల్‌రాజ్ జకారియాస్, ఎం.శ్రీకాంత్, పరుచూరి రామయ్య, నవజీవన్ సికింద్రాబాద్‌లోని ఇవాంజికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా (యూఈఎస్ఐ)లో సభ్యులు. వీరికి 2018 అంగూరి ప్రకాష్‌కుమార్ (54) పరిచయమై క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయనడంతో దశల వారీగా వారు మొత్తం రూ.65,36,590 పెట్టుబడిగా పెట్టారు.ఆ తర్వాత ఎంతకూ తిరిగి డబ్బులు రాకపోవడంతో బాధితులు ఆరా తీశారు. ప్రకాష్‌కుమార్‌ను కలిసేందుకు యత్నించగా కనబడకుండా పోయాడు. చివరకు వెబ్ సైట్ గురించి తెలుసుకుంటే అది నకిలీదని, నిందితుడే దాన్ని తయారుచేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంగళ్ ప్రవేశ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం



అమీర్‌పేట: అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని మోహన్ మోటర్స్ వద్ద నాగరాత్రయ్ మంగళ్ ప్రవేశ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ వర్ధమాన స్థాన క్వాసిజైన్ శ్రావక్ సాంగ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరయ్యారు. పూణె నుంచి కాలినడకన నగరానికి చేరుకున్న జైన్ సాదు గురుదేవ్ శ్రీ సమ్‌కిత్ మునికి స్వాగతం పలికారు.

ఎస్ఆర్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్

అమీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఆర్ నగర్ పోలీసులు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో బలగాలను ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించి బైండోవర్ చేశామన్నారు.

బీజేపీ గెలుపే మాదిగల విజయం



మంద కృష్ణ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే మాదిగల విజయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో మాదిగ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు మంద రాజు అధ్యక్షత వహించగా మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగ జాతిని మోసగించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి వర్గీకరణ లక్ష్యాన్ని అందించబోతున్న నరేంద్రమోదీకి తెలంగాణలో మాదిగ, ఉపకులాల విద్యార్థులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఓయూ విద్యార్థులు సికింద్రాబాద్ బరిలో ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపుకోసం శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు సోమశేఖర్‌మాదిగ, సందేకార్తీక్‌మదిగ, కొమ్ము శేఖర్‌మాదిగ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపునకు ఎమ్మార్పీఎస్ ప్రచారం

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నేత ఈరంగారి రాములుమాదిగ ఆధ్వర్యంలో గడప గడపకూ తిరుగుతూ బీజేపీ మేనిఫెస్టో, కేంద్రంలో నరేంద్రమోదీ చేపట్టిన పథకాల అమలుతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములు మాదిగ మాట్లాడుతూ.. పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు హాజరైన నరేంద్రమోదీ లక్షలాది జనం ముందు ఏబీసీడీ వర్గీకరణ బీజేపీ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కిషన్‌రెడ్డి గెలుపు కోసం మాదిగలంతా ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్నమాదిగ, కావాలి భాగ్య, కావాలి సుజాత, మల్లెల కిరణ్, ప్రభాకర్, మచ్చగిరి మాదిగ, శంకర్‌మాదిగ, రాముమాదిగ, శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

కంటోన్మెంట్: ఒక్కసారి కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా అవకాశమిస్తే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ ఐదోవార్డు పరిధిలోని సంజీవయ్య నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా కంటోన్మెంట్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే అలసత్వం కారణంగా బోర్డు సభ్యులు ఇష్టారాజ్యం కొనసాగిందన్నారు. కంటోన్మెంట్‌లో సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే రూ. లక్షల్లో లంచం ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పేదలను పీడిస్తున్న ఈ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన బస్తీ వాసులకు పట్టాలు, కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం వంటి హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రచారం ప్రారంభానికి ముందు సంజీవయ్య నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నేత నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో శ్రీను, మాణిక్యం, బాలరాజ్, రమేశ్, సురేశ్, శివ, శ్రీనివాస్ ఉన్నారు.



పార్టీలో చేర్చుకుంటున్న శ్రీగణేశ్

అవినీతి పార్టీలను తరిమికొట్టండి



ఇంటింటి ప్రచారంలో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: అవినీతి పార్టీలను తరిమికొట్టి మరోసారి సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బేగంపేట భగవంతాపూర్‌లో ఆదివారం ఆయన కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో కేంద్రంలో నరేంద్రమోదీ సర్కార్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్కాములమయంగా ఉండేదని, ఈ పదేళ్ల కాలంలో ఎలాంటి స్కాములకు ఆస్కారం లేకుండా మోదీ పరిపాలన కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి పురురవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ ఏ లో కలుపుతామనడం సరికాదు'



అభివాదం చేస్తున్న బీసీ ఏ గ్రూపు కుల సంఘాల ప్రతినిధులు

పంజగుట్ట: సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజ్‌లను బీసీ ఏ లో కలుపుతామని ప్రకటించడం సబబు కాదని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ ఏ గ్రూపు లోని 57 కులాల ప్రతినిధులు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, నగర అధ్యక్షుడు చాట్ల సదానంద్, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య, బీసీ ఏ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎం.ఎస్.నరహరి, కార్యదర్శి ముత్యాల నర్సింహులు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా నారాయణపేట ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బీసీ డీ లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏ లో కలుపుతానని ప్రకటించడం బాధాకరమన్నారు. బీసీ ఏ లో అన్ని అణగారిన కులాలు ఉన్నాయని అందులో ముదిరాజ్‌లను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఉన్న ఈ అంశాన్ని ఎలా మాట్లాడతారని, అది ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో కోర్టు ధిక్కరణకు పాల్పడడం సరికాదన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే బీసీఏ లోని 57 కులాలు, రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్నామని అందరం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తామని హెచ్చరించారు. ముదిరాజ్‌ల కన్నా తాము ఎక్కువగా ఉన్నామని త్వరలోనే ఒక భారీ కార్యక్రమం నిర్వహించి చూపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.ఎల్.ఎం.సుధాకర్, లక్ష్మయ్య, శివరత్నం, శంకర్, ఓంప్రకాశ్, వై.మల్లేశ్ పాల్గొన్నారు.

చిన్నారి.. మీ అమ్మానాన్న నాకే ఓటేయాలి

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో భాగంగా అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆదివారం రసూల్‌పురా ప్రాంతంలోని పలు బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ ఇంటింటికీ ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న భారీ ర్యాలీలో చిన్నారులు రాగా వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చి మీ అమ్మానాన్నల ఓటు నాకే వేయాలని చెప్పాలంటూ ముందుకు సాగారు. -రసూల్‌పురా



బొట్టుపెట్టి చెబుతున్నాం.. నీకే ఓటేస్తాం

బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత ఆదివారం బోర్డు మాజీ సభ్యులు లోక్‌నాథ్ ఆధ్వర్యంలో వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పలు వార్డుల్లో ఆమెకు జనాలు మంగళహారతులిచ్చి బొట్టు పెట్టి స్వాగతం పలికారు. తమ మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఈ సందర్భంగా నివేదిత ఓటర్లను కోరారు. -రసూల్‌పురా

